ఇక పక్కా.. పశువుల లెక్క

- పశుగణన చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- 120 రోజుల పాటు నిర్వహణ
- మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు
- టీకాల తయారీ, పథకాల రూపకల్పన ఈ వివరాలే ప్రామాణికం



పశుగణన చేస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం 21వ పశుగణనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలు సేకరిస్తున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, కుక్కల వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకూ పశుగణన కొనసాగనుంది. సెప్టెంబర్ 1న ప్రారంభించి డిసెంబర్ 31లోపు ముగించే విధంగా కేంద్రం మొదట షెడ్యూల్ ఇచ్చింది. యాప్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో పశుగణన కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది.

స్వాతంత్ర్యానికి ముందు నుంచే పశుగణన

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే పశుగణన జరుగుతోంది. ఇప్పటివరకు 20 సార్లు పశుగణన చేశారు. మొదటి సారి 1919–20లో పశుగణన జరగ్గా తాజాగా 21వ గణనను ప్రారంభించారు. అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పశువులపై ఆరా తీస్తున్నారు. అన్ని రకాల పశువుల వివరాలను లెక్కిస్తారు. వీధి కుక్కలను మాత్రం పరిగణనలోకి తీసుకోరు. వీధి కుక్కలపై గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు ఇచ్చే వివరాలను నమోదు చేస్తారని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు.

ప్రతి ఇంటికి వెళ్లి నమోదు

పశుగణనకు ఎన్యూమరేటర్లు ప్రతిఇంటికి వెళ్లి ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలను సేకరించి, వాటిని ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పశుగణనకు జిల్లా పశుసంవర్ధకశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పశు సంవర్ధకశాఖ సహాయకులు (ఏహెచ్ఏ), ఇతర పారా సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. ప్రభుత్వ పశువైద్యశాలల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏరియా అసుపత్రుల ఏడీలు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలో 17 మంది, ఏలేశ్వరం మండలంలో 13 మంది, శంఖవరం మండలంలో ఐదుగురు, రౌతులపూడి మండలంలో 14 మంది వెరసి 49 మంది పశు సంవర్ధక శాఖ సహాయకులు (ఏహెచ్ఏ) ఉండగా మరో పది మందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు.

పశుగణనకు ప్రజలు సహకరించాలి



20వ పశుగణన ప్రకారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో 11,463 ఆవులు, 40,492 గేదెలు, 34,072 గొర్రెలు, 34,640 మేకలు, 1,21,624 కోళ్ల ఉన్నాయి. 21వ పశుగణన 2025 ఫిబ్రవరి నెలాఖరు జరుగుతుంది. ఇందుకోసం ఏడుగురు సూపర్‌వైజర్లు, 59 మంది ఎన్యూమరేటర్లను నియమించాం. పశువులు ఉన్నా .. లేకున్నా... ప్రతి ఇంటికీ ఎన్యూమరేటర్లు వస్తారు. వారికి ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలి. పశు గణనకు ప్రజలు సహకరించాలి.

– చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

పథకాల రూపకల్పనకు అవకాశం

పశుగణనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పశుగణన ద్వారా గతంలో కంటే పశువుల సంఖ్య పెరిగిందా ? తగ్గిందా ? అనే వివరాలు తెలుస్తాయి. తద్వారా పశువుల కోసం, పశు పోషకుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలి, పశు వైద్యశాలలు, వైద్యుల సంఖ్యను పెంచాలా లేదా తదితర అంశాలకు ప్రణాళికను రూపొందించేందుకు వీలవుతుంది. టీకాల తయారీ, పథకాల రూపకల్పనకు పశుగణన ప్రామాణికం. పాలు ఇచ్చే పశువులెన్ని.. పాలివ్వని పశువులెన్ని...అనే వివరాలు తెలుస్తాయి. గతంలో కంటే పాడి అవసరం ఎంత మేరకు ఉంది, మందులు సరిపడా ఉన్నాయా.. లేవా అనే వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. తద్వారా పాడి పరిశ్రమకు ఏ మేరకు నిధులు కేటాయించాలనే దానిపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుంది. పశుగణన ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంక్షేమ కార్యక్రమాలు చేపడతాయి.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

కిర్లంపూడి: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సోమవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం స్థానిక ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ లంటూ ఫోన్లు చేసి డబ్బులు లూటీ చేస్తున్నారన్నారు. డిజిటల్ అరెస్టు అనేది చట్టంలో లేదన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జె.కొత్తూరులో పోలీసుల రచ్చబండ

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో పోలీసుల రచ్చబండ నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాస్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో పలు వ్యాయామాలు చేయించారు. పిల్లల ఆరోగ్యం, రోజూ చేయించాల్సిన వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోజూ ఇంటి దగ్గర ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేయించాలని సూచించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులకు నిరసనగా ర్యాలీ



తునిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

తుని: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ధార్మిక సంస్థలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ తునిలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. స్థానిక కొత్తపేట లక్ష్మీ గణపతి ఆలయం నుంచి ర్యాలీ చేసి బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూపరిషత్ నాయకులు ఎంవీయూ కుమార్, డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, గెలం శ్రీను, ప్రసాద్, సత్య, నారాయణాచార్యులు, ఆకెళ్ల శాస్త్రి, కాదంబరి రామకృష్ణ, వెలుగుల గోపాలకృష్ణ, నాగభూషణం పాల్గొన్నారు.

ఫోరెన్సిక్స్ మ్యాగజైన్ ఆవిష్కరణ

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫోరెన్సిక్స్ మ్యాగజైన్ మూడో సంచికను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు బుధవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, హెచ్‌ఓడీ ఉదయనాథ్, దర్శన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కంపించిన భూమి

తొండంగి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, బెండపూడి, రావికంపాడు తదితర గ్రామాల్లో ఉదయం ఏడు గంటల ప్రాంతంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు.

12న చిన జీయర్‌స్వామి రాక

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై నిర్మిస్తున్న ఆంధ్రా భద్రాద్రి శ్రీరామనామ క్షేత్రానికి ఈ నెల 12న త్రిదండి చిన జీయర్‌స్వామి రానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఆ రోజు ఆంధ్రా భద్రాద్రిలో జరిగే శ్రీరామ పాదుకా పట్టాభిషేకంలో ఆయన పాల్గొంటారన్నారు. భక్తులు పాల్గొని శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఘంటసాల జయంతి



లింగంపర్తిలో ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆధ్యాత్మిక వేత్త ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీపంలోని చౌటుపల్లిలో సూర్యనారాయణ, రత్తమ్మ దంపతులకు ఘంటసాల జన్మించారన్నారు. తన మధురమైన గానంతో సంగీత ప్రపంచానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాటూరి సూరిబాబు, చెదల సూరిబాబు వల్లంరెడ్డి కొండయ్య, వాగు బాబులు, కప్పల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 గోవింద్

శంఖవరం: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 గోవింద్ మాట్లాడుతూ దివ్యాంగులను చులకన భావంతో చూడొద్దన్నారు. దివ్యాంగులు అద్భుతాలు సృష్టించవచ్చని హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హాకింగ్, థామస్ ఆల్వా ఎడిసన్, హెలెన్ కిల్లర్ వంటి ఎందరో నిరూపించారన్నారు. భవిత కేంద్రంలో ప్రతివారం క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, బ్రహ్మానందం స్వప్న, సీఆర్పీలు పాల్గొన్నారు.

వినూత్నంగా కార్మికుల నిరసన



చిన్నింపేటలో జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద కార్మికులు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు చూపుతున్న విద్యార్థినులు

శంఖవరం: స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు పాఠశాలలోని 263 మంది విద్యార్థినులకు ప్రిన్సిపాల్ బాలాకుమారి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడ్



తొండంగి-ఒంటిమామిడి రహదారిలో తొలగించని ఫ్లెక్సీ



తొండంగి మెయిన్ రహదారిలో పెద రామాలయం ఎదురుగా ఉన్న ఫ్లెక్సీ

తొండంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మండలంలో సక్రమంగా అమలు కావడం లేదు. కూటమి పార్టీ నేతల ఫ్లెక్సీలు బహిరంగంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. తొండంగి-ఒంటిమామిడి రోడ్డులో ఏర్పాటు చేసిన కూటమి నేతల ఫ్లెక్సీలు అధికారులు తొలగించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. అలాగే ఇదే రహదారిలో పెదరామాలయం ఎదురుగా ఉన్న మరో ఫ్లెక్సీతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఫ్లెక్సీలు తొలగించకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

చలి, పొగమంచుతో ఇక్కట్లు



తుని తాండవ నదిలో అలుముకున్న మంచు దుప్పటి

తుని: రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి చేరడంతో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు నుంచి ఉదయం 8 గంటలకు మంచుతో పాటు చలిగాలులు వీస్తున్నాయి. ప్రజలు చలిని తట్టుకునేందుకు ఉన్ని దుస్తులు ధరించినా ఇబ్బందులు తప్పడం లేదు. మంచు కారణంగా ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు సమయ వేళలను మార్చుకున్నారు. గతంలో తెల్లవారుజామున నాలుగు గంటలకు వాకింగ్‌కు వెళితే ప్రస్తుతం ఉదయం 6 గంటలకు వెళుతున్నారు. ఇక రహదారుల్లో దట్టమైన పొగ మంచు కప్పి ఉంటోంది. వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. సక్రాంతి పండగ వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



ప్రత్తిపాడులో పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

తుని రూరల్: మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలు వరకు ఓటింగ్ జరుగుతుందని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. 261 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్టు ఆయన తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ పరిసరాల్లో 144 (263) సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. మండలంలో 71 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్టు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద బుధవారం సాయంత్రం నుంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తొండంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ మురార్జి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 61 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు.

కిర్లంపూడి: మండలంలో గురువారం జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు తహసీల్దార్ జె.చిరంజీవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. 53 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు.

అందుబాటులో అపరాల విత్తనాలు

ప్రత్తిపాడు రూరల్: అపరాల సాగుకు కావాల్సిన ఎనిమిది రకాల విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ అన్నారు. మండలంలోని వాకపల్లిలో బుధవారం మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ రైతులు రబీలో వేయాల్సిన వరి రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరాల సాగు, పంటలను కోతులు, అడవి పందులు ధ్వంసం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రామలక్ష్మి, మణికంఠ, సర్పంచ్ రొంగల నాగేశ్వరావు, కురందాసు అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.

గోతులు.. రాకపోకలకు వెతలు



కాకరాపల్లి శివారులో తుని-నర్సీపట్నం రోడ్డు దుస్థితి

కోటనందూరు: మండలంలోని తుని–నర్సీపట్నం రోడ్డు అడుగడుగునా గోతులతో అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లేందుకు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షానికి కాకరాపల్లి శివారులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. తరచూ ప్రయాణికులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. తుని నుంచి కోటనందూరు వరకూ అక్కడక్కడా గుంతలు పూడ్చిన ఆర్అండ్‌బీ అధికారులు కాకరాపల్లి నుంచి జిల్లా సరిహద్దు వరకూ గుంతలు పూడ్చకుండా వదిలేశారు. దీంతో అధికారుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

తొండంగి: మండలంలోని తీరప్రాంత పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఆ సంఘ ఫౌండర్స్ పీజీ స్టీఫెన్, వై.ఆశీర్వాదం తెలిపారు. దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో సీకోస్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు తెలిపారు. సంఘ ప్రెసిడెంట్‌గా జి.జాన్, కార్యదర్శిగా ఎం.శ్యామ్‌సుందర్, కోశాధికారిగా కె.స్టీఫెన్, వైస్.ప్రెసిడెంట్‌గా సీహెచ్ దానియేలు, సంయుక్త కార్యదర్శులుగా వై.సియోను, ఎస్.జయరాజులు, మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ హేచరీస్ అవార్డు గ్రహీత, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యానారాయణరెడ్డి(పెద బాబు), యనమల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారు గోవిందపురం రోడ్డులో సారా బట్టీలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారు చేస్తున్న వై.అప్పికొండను అరెస్టు చేసి అతని నుంచి 10 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా తుని పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారి వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాయకరావుపేట 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బాలమోగిమెట్ట 33/11 కేవీ తాండవ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తుని పట్టణంలోని సీతారాపురం, కొండవారిపేట, డ్రైవర్స్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, తుని మండలంలోని మరువాడ, ఆర్‌కే పాలెం, జగన్నాథగిరి, లోవకొత్తూరు, వెలంపేట, తాళ్లూరు, ఎస్ఎస్‌వీ నగరం, ఎస్.సూరవరం, కొలిమేరు, పోలవరం, నందివంపు, కేఓ మల్లవరం, దొండవాక, రాపాక, బీఎస్ పేట, సీహెచ్ అగ్రహారం తదితర గ్రామాలకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

షష్ఠి ఉత్సవాలకు రాట ముహూర్తం



కత్తిపూడిలో షష్ఠి మహోత్సవానికి రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవానికి బుధవారం రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట వేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళల హక్కులు, రక్షణపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పెద్దాపురం కోర్టు ప్రధాన సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. లింగ సమానత్వం, సమాజ నిర్మాణంలో మహిళల కీలక పాత్రను వివరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, ఆర్. సునీత, యు.రాజ్యలక్ష్మి, ఎస్.అరుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28 నాటికి లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రత్తిపాడు: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు 2025 ఫిబ్రవరి 28వ తేదీ లోపుగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ అధికారి ఎండీ సలీమ్‌ఖాన్ కోరారు. స్థానిక ఖజానా (సబ్ ట్రెజరీ) కార్యాలయంలో బుధవారం పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు స్మార్ట్ ఫోన్లో కానీ, మీ సేవా కేంద్రాల్లో కానీ, నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో గాని తమ వేలిముద్రల ద్వారా లైఫ్ సర్టిఫికేట్లను అందజేయాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు అందజేయనివారి పింఛన్లను మార్చి నుంచి ప్రభుత్వం నిలిపివేస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం 135 నెలలు పూర్తయిన పెన్షనర్ల నుంచి రికవరీ చేసిన కమ్యూనిటేషన్ సొమ్ము ఈ నెల నుంచి వారి ఖాతాలకు జమ చేస్తారని తెలిపారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, జంధ్యం సుబ్బారావు, చుక్కల సత్యనారాయణ, ఎండీ ఇబ్రహీంఖాన్, భాను, యలమంచిలి రామం, అవసరాల శేషగిరిరావులతో పాటు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

గోకవరం: మండలంలోని తంటికొండ మార్గంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గోకవరం శివారు ఇందిరమ్మ మోడల్ కాలనీ నుంచి తంటికొండ వరకు వేసిన ఈ రోడ్డులో గతంలో ఉన్న తారు రోడ్డుని పూర్తిగా తొలగించకుండా సిమెంట్ రోడ్డు వేశారన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును కేవలం 12 అడుగులు మాత్రమే నిర్మించడం వలన ఎదురుగా వాహనం వస్తే తప్పించే పరిస్థితి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.